
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 సెప్టెంబరు 2024



రేపు 'దిశా' సమావేశం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ (దిశా) కమిటీ సమావేశం ఈనెల 28న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరుగనున్నట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వివిధ పనుల కోసం అయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.



రైస్‌మిల్లర్లకు డెడ్‌లైన్!

ఈ నెలాఖరులోపు బియ్యం ఇవ్వని మిల్లులపై చర్యలకు సిద్ధం

- జిల్లాలో ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులపై చర్యలకు రంగం సిద్ధం
- కస్టం మిల్లింగ్ బియ్యానికి ఈ నెల 30 వరకు గడువు
- జిల్లాలో ఇప్పటికే 39 మిల్లులకు నోటీసుల జారీ
- స్పందించకుంటే ఆస్తులను జప్తు చేయనున్న అధికారులు

నిజామాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులకు డెడ్ లైన్ పెట్టారు. ఈ నెలాఖరులోపు కస్టం మిల్లింగ్ కింద బియ్యం ఇవ్వని మిల్లులపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 39 మిల్లులకు నోటీసులు ఇచ్చిన అధికారులు మరికొన్ని మిల్లులపై చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్లలో ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వని మిల్లుల నుంచి వసూలు చేయడంతో పాటు దారికి దారి మిల్లులపై ఆర్ఆర్ యాక్ట్ కింద కేసులను నమోదు చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెలాఖరులోపు బియ్యం నిబంధనల మేరకు ఎఫ్‌సీఐకి ఇవ్వని మిల్లులపై చర్యలు చేపట్టనున్నారు. డిఫాల్ట్ మిల్లులన్నింటికీ ఈ సీజన్‌లో ధాన్యం కూడా నిలిపివేయనున్నారు. మొత్తం చెల్లింపులు జరిగిన తర్వాతనే ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు.

నాలుగు సీజన్‌లలో ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో నాలుగు సీజన్‌లలో ధాన్యం కొనుగోలు చేశారు. వాటిని రైస్‌మిల్లులకు కస్టం మిల్లింగ్ కోసం అందించారు. వీటిలో కొన్ని మిల్లులు ధాన్యాన్ని తీసుకోవడంతో పాటు మిల్లింగ్ చేసి బియ్యాన్ని అమ్ముకున్నారు. మరికొన్ని మిల్లులు బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు. రెండు సంవత్సరాలైనా బియ్యం ఇవ్వకపోవడం.. ధాన్యం నిల్వలు చూపెట్టకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని మిల్లులను గత నాలుగు నెలల నుంచి తనిఖీలను చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లాకు వచ్చి మిల్లులను తనిఖీ చేశారు. ప్రతీ సీజన్‌లో కేటాయించిన ధాన్యం నిల్వలు ఆ మిల్లుల్లో లేనట్లు గుర్తించారు. ప్రభుత్వానికి నివేదించారు.

రూ.250 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి

జిల్లాలో సుమారు రూ.250 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఆయా మిల్లులకు నోటీసులను జారీ చేశారు. బియ్యాన్ని సకాలంలో కస్టం మిల్లింగ్ కింద పెట్టాలని ఆదేశాలు ఇచ్చారు. కొన్ని మిల్లుల యజమానులు నోటీసులకు స్పందించి బియ్యాన్ని అందించగా మరి కొన్ని మిల్లుల యజమానులు ధాన్యంకు అనుగుణంగా చెల్లింపులకు ముందుకు వచ్చారు. మిగతా వారు చూపెట్టకపోవడంతో కొన్ని మిల్లులపై కేసు పెట్టారు. జిల్లాలో ఇప్పటి వరకు తనిఖీ చేసిన వాటిలో 39 మిల్లులకు నోటీసులను జారీ చేశారు. వీటిలో ధాన్యం నిల్వలు లేకపోవడం బియ్యం కస్టం మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి ఇవ్వని మిల్లులపైన కేసులను నమోదు చేశారు. వీటిపై ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలను చేపట్టారు. ఆలోపు ధాన్యం నిల్వలతో పాటు కేటాయింపులకు అనుగుణంగా చెల్లింపులను చేయకుంటే ఆస్తులను కూడా జప్తు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని మిల్లులు ఇప్పటికే కొంత మేర బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించగా ఆ మిల్లులకు మిగతా బియ్యాన్ని అందించేందుకు ఈనెల 30 వరకు డెడ్‌లైన్‌ను విధించారు. ఆ డెడ్‌లైన్‌లోపు బియ్యం నిల్వలను అందించాలని ఆదేశాలు ఇచ్చారు. డెడ్ లైన్ ప్రకారం 60 మిల్లుల వరకు ఈ నెలాఖరు వరకు బియ్యం అందించాల్సి ఉంది. వాటిలో కొన్ని మిల్లులు ఇప్పటికే ఎఫ్‌సీఐకి బియ్యం అందించినట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. స్పందించని మిల్లులపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ నెలలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో స్పందించని మిల్లుల ఆస్తులను కూడా జప్తు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇతర జిల్లాల్లో మిల్లులకు సంబంధించిన ఆస్తులను కూడా అమ్మి ధాన్యాన్ని అనుగుణంగా డబ్బులను జమ చేస్తున్నారు. అదే రీతిలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. అధికారులు ఎక్కువగా చర్యలకు సిద్ధమవుతుండటంతో మిల్లర్లు కూడా ముందస్తుగా నగదు చెల్లింపులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ధాన్యం నిల్వలు లేని మిల్లుల యజమానులు ఇప్పటికే అధికారులను కలిసి గడువు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. నిర్ణీత సమయంలో చెల్లింపులు చేయకుంటే వచ్చే నెలలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించనున్నారు. డిఫాల్ట్ ఉన్న అన్ని మిల్లులకు ఈ సీజన్‌లో ధాన్యం కేటాయింపులను నిలిపివేస్తున్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకొని ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఆ ఆదేశాలకు అనుగుణంగానే ఆ మిల్లులను వదిలివేసి ఇతర మిల్లులకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. గతంలో మిల్లుల కెపాసిటీ కన్న ఎక్కువ మొత్తంలో ధాన్యం నిల్వలను అధికారులు కేటాయింపులు చేశారు. మిల్లుల యజమానులతో పాటు ప్రజాప్రతినిధుల ఒత్తిడిలకు అనుగుణంగా ధాన్యాన్ని ఆ మిల్లులకు ఇచ్చారు. కెపాసిటీకి మించి కేటాయించడం వల్ల నిర్ణీత సమయంలో కస్టం మిల్లింగ్ కింద ఆ మిల్లులు ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అందించలేదు. కొన్ని మిల్లుల్లో ధాన్యం పక్కదారి పట్టింది. ఈ దఫా ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు ముందస్తుగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మిల్లుల కెపాసిటీకి అనుగుణంగానే కేటాయించాలని ఆదేశాలను ఇచ్చింది. దానికి అనుగుణంగానే ప్రస్తుతం ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులను పక్కనపెట్టి మిగతా మిల్లుల లిస్టులను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ నెలాఖరులోపు కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని అందించే మిల్లులను మినహాయించి పెండింగ్ మిల్లులన్నింటిపై చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పెండింగ్ మిల్లుల నుంచి ధాన్యంకు సంబంధించిన పెండింగ్ బియ్యంతో పాటు డబ్బులను వసూలు చేసేందుకు అధికారులు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. గడువులోపు ఎంత మంది బియ్యం చెల్లిస్తారో ఎంత మంది బ్లాక్ లిస్ట్‌లో చేరుతారో మూడు రోజుల్లో తేలనుంది.

ఎస్సారెస్పీ 22గేట్ల ఎత్తివేత

• ప్రాజెక్టులోకి లక్ష క్యూసెక్కుల వరద • ప్రధానకాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల



గేట్ల ద్వారా గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, సెప్టెంబరు 26: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి లక్షా 9వేల 214క్యూసెక్కుల వరద చేరుతుండడంతో 22వరద గేట్లను ఎత్తి 81వేల 224క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం మహారాష్ట్ర విష్ణుపూరి బలేగావ్‌ల నుంచి 70వేల క్యూసెక్కులు, మంజీర నుంచి 30వేల క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి ఉదయం 47వేల 734 క్యూసెక్కుల నీరు చేరగా ప్రాజెక్టు ఆరు గేట్లను ఎత్తి 18వేల744 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఉదయం 10గంటల సమయంలో ప్రాజెక్టులోకి 58వేల 230క్యూసెక్కుల వరద పెరగగా మరో నాలుగు గేట్లను ఎత్తి పది గేట్ల ద్వారా 31వేల 240క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరగగానే 20గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 90వేల 470 క్యూసెక్కుల నీరు వరద పెరగడం 20వరద గేట్లను ఎత్తి 62వేల 470క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాయంత్రం ప్రాజెక్టులోకి లక్షా 9వేల 214 క్యూసెక్కుల వరద పెరగడంతో మరో రెండు గేట్లను ఎత్తి 22గేట్ల ద్వారా 81వేల 224 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 19వేల క్యూసెక్కుల కాకతీయ కాలువకు 6వేల800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 50క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 700 క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00అడుగులు (80.5టీఎంసీ)లు కాగా గురువారం సాయంత్రానికి 1091.00 అడుగులు (80.501టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి ప్రాజెక్టులోకి 202టీఎంసీల నీరు చేరగా ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధానకాలువల ద్వారా 129టీఎంసీల నీరు విడుదల చేశారు.

మహిళా పోరాట శక్తికి ప్రతీక ఐలమ్మ



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మహిళా పోరాట శక్తికి ప్రతీక అని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల చాకలి ఐలమ్మ విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్, తదితరులతో కలిసి ఆయన పూలమాలలు వేశారు. అనంతరం సమీకృత కలెక్టరేట్‌లో జ్యోతిప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీర వనిత అన్నారు.



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నగర మేయర్

మహిళా పోరాట శక్తికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటానికి ఊపిరి పోశారని అన్నారు. ఐలమ్మ చూపిన తెగువ, శౌర్యం, ధైర్యం ప్రతి ఒక్కరిలో ప్రేరణ కలిగించిందని ఆమె పోరాట స్ఫూర్తిని నేటితరం పునికి పుచ్చుకోవాలనే భావనతో ప్రభుత్వం ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి

- హోల్‌సేల్‌లో కిలో రూ.45
- రిటేల్ మార్కెట్‌లో కిలో రూ.65
- ధరల పెరుగుదలతో సామాన్యుడి బెంబేలు
- తరుగుతో నష్టాలు వస్తున్నాయంటున్న ఉల్లి వ్యాపారులు



ఖిల్లా, సెప్టెంబరు 26: జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉల్లి ధరలతో మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కిలో 65 రూపాయలకు చేరడంతో కొనలేక.. తినలేక సతమతమవుతున్నారు. రోజు రోజుకూ ధరలు పెరగడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.45నుంచి 50రూపాయలు పలుకుతున్న ఉల్లి ధర రిటేల్ మార్కెట్‌లో 60నుంచి 70రూపాయల వరకు పలుకుతోంది. దీంతో వినియోగదారులు ఉల్లిని కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. గతంలో వంద రూపాయలకు నాలుగు కిలోలున్న ఉల్లి.. ప్రస్తుతం రూ.60 నుంచి రూ.70వరకు ధర పలుకుతోంది.



మహారాష్ట్ర నుంచి దిగుమతి..

ఉల్లి సాగు ఎక్కువగా ఉన్న మహారాష్ట్రలోని షోలాపూర్ తదితర పట్టణాల నుంచి ప్రతి రోజూ రెండు నుంచి మూడు లారీల్లో ఉల్లి లోడ్ నగరానికి వస్తోంది. సుమారు 20నుంచి 30 టన్నుల ఉల్లిగడ్డలు వస్తుండగా వాటిని అమ్మలేక నానా ఇబ్బందులు పడుతున్నామని హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. గతంలో గడ్డ బాగ ఎండినది రావడం వల్ల నష్టాలు తక్కువగా వచ్చేవని, ప్రస్తుతం రైతులు గడ్డ పచ్చిగా ఉండగానే వాటిని విక్రయానికి మార్కెట్‌కు తీసుకుని రావడం వల్ల తమకు నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

తరుగు వల్ల నష్టాలు వస్తున్నాయి..



: మహ్మద్ సాజిద్, చిరువ్యాపారి

ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధరలు ఎక్కువగా ఉండడం వల్ల లాభాల కంటే నష్టాలు ఎక్కువగా వస్తున్నాయి. తెచ్చిన సరుకు నుంచి ప్రతి బ్యాగుకు రెండు, మూడు కిలోల గడ్డలు తరుగు పోతున్నాయి. తరుగు పోవడం వల్ల ధరలను పెంచాల్సి వస్తోంది. దీంతో వినియోగదారులు కొనుగోలు చేయడానికి వెనుకంజవేస్తున్నారు.

ధర పెరిగినా కొనుగోలు చేయాల్సిందే..



:లక్ష్మణ్, వినియోగదారుడు

ఉల్లి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ఉల్లి లేనిదే వంటలు చేయడానికి అవకాశం ఉండదు. ధర అందుబాటులో లేకున్నా.. ఉల్లిగడ్డలు కొనుగోలు చేయాల్సిందే. కూరల్లో ఉల్లి వేయకుంటే రుచి రాదు. ప్రతి కూరగాయల్లో ఉల్లిని తప్పకుండా వినియోగించాల్సిందే.

4న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ రాక

29న ఏర్పాట్లపై విస్తృత స్థాయి సమావేశం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన జిల్లాకు చెందిన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ వచ్చేనెల 4వ తేదీన జిల్లాకు రానున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత మొట్టమొదటి సారి జిల్లాకు వస్తున్న ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు ఈనెల 29వ తేదీన జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ డెలిగేట్‌లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు ఈనెల 29న ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి హాజరుకావాలన్నారు. అక్టోబర్ 4న నిర్వహించే స్వాగత కార్యక్రమంతో పాటు పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభ విజయవంతంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



మొక్కలు నాటుతున్న పోలీసు కమిషనర్

మొక్కలు నాటి భావితరాలకు బహుమతిగా ఇవ్వాలి

ఖిల్లా, సెప్టెంబరు 26: రానున్న పిల్లలు, భావితరాల కోసం ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి వారికి బహుమతిగా ఇవ్వాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ అన్నారు. పోలీసు కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ ఆవరణలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం పచ్చదనం స్వచ్ఛతతో పాటు కాలుష్యం పెరుగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్(అడ్మిన్) బి.కోటేశ్వర్‌రావ్, అదనపు పోలీసు కమిషనర్ (ఏఆర్) శంకర్‌నాయక్, కార్యాలయ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది, రిజర్వు ఇన్స్‌పెక్టర్స్ ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది సీసీఆర్‌బీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టానికి కారకులైన వారిపై చర్యలు చేపట్టాలి

● పొతంగల్ విండో

మహాజన సభలో సభ్యుల డిమాండ్



పొతంగల్‌లో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు

కోటగిరి,సెప్టెంబరు 26: రాష్ట్రంలో సహకార సంఘాలకు ఆదర్శంగా నిలిచిన పొతంగల్ విశాల సహకార సంఘం పాలకవర్గం అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో నష్టాల ఊబిలోకి వెళ్లిందని ఇందుకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు చేపట్టాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. పొతంగల్ విశాల సహకార పరపతి సంఘం 89వ సాధారన మహాజన సభ గురువారం సంఘం అధ్యక్షులు శాంతేశ్వర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీవో శ్రీనివాస్‌రావు ప్రత్యేకంగా హజరయ్యారు. సంఘం పనితీరుపై సంఘ సభ్యులు గతంలో పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో నష్టాలపై విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో పలు అంశాల్లో 58లక్షల నష్టం జరిగినట్లు విచారణ జరిపిన అధికారులు నివేదిక అందజేశారు. ఈ సందర్భంగా డీసీవో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సంఘంలో వ్యాపారాలు, లావాదేవీలు, పరిపాలన, నిర్లక్ష్యంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపఆల్సి ఉందన్నారు. ఇనకం ట్యాక్స్, ప్రావిడెంట్ ఫండ్, సేల్స్ ట్యాక్స్ జరిమానాల వల్ల సంఘానికి నష్టం జరిగిందన్నారు. పీఎఫ్‌లో 7లక్షల రూపాయలు కమర్షియల్ ట్యాక్స్‌లో 21లక్షలు, ఇతరత్రా ఖర్చులలో 30లక్షల రూపాయలు లెక్క తేలకుండా పోయిందన్నారు. ఫర్టిలైజర్ వ్యవహారంతో సుమారు 2కోట్ల రూపాయల లెక్కలు తేలడం లేదన్నారు. ఈ విషయమై స్పందించిన సభ్యులు పాలకవర్గాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నష్టాలకు కారకులైన వారిపై చర్యలు చేపట్టాలని వారి వద్ద నుంచి నగదు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘంలో ఇంటర్నల్ ఆడిట్ జరుపాలని కోరారు. విండో కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించి సరైన సమయంలో మహాజన సభలు నిర్వహించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ జరిపి సంఘాన్ని రక్షించాలని సభ్యులు కోరారు.

గోపాల్‌పేటలో భక్తి శ్రద్ధలతో దర్గా ఉత్సవాలు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 26: మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామంలో పీరానే పీర్ గౌస్ అజం దస్తగీర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ దర్గా ఉత్సవాలు గురువారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఖాన్ ఖాయే అబిదుల్ హాష్మీ పీఠాధిపతి హజ్రత్ ముహమ్మద్ షరీఫోద్దీన్ షత్తారీ ఉల్ ఖాద్రి ఆధ్వర్యంలో దర్గా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ దర్గా ఉత్సవాలలో సంగారెడ్డి జిల్లా అన్నాసాగర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సూఫీషా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ షత్తారి ఉల్ ఖాద్రి ప్రత్యేక ఆహ్వానితులుగా మాజరై దర్గా ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం ఖురాన్ పఠనంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం దర్గా వద్ద గంధం, చాదర్‌లను దర్గాపై సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాల్తుమ్మెద దర్గా పీఠాధిపతి మహ్మద్ రహీం, శతారి ఉల్ ఖాద్రి, మహ్మద్ అబ్దుల్ ఖరీం పాల్గొన్నారు.

సాటాపూర్ ఎరువుల దుకాణానికి నోటీస్

రెంజల్, సెప్టెంబరు 26: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సాటాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని గురువారం వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు ఈ మిషన్ లేకుండా ఎరువులను అమ్ముతున్నందున అమ్మకం నిలుపుదల ఉత్తర్వులను అందించడం జరిగిందని వ్యవసాయ అధికారి తెలిపారు. అనంతరం బోర్గాం గ్రామంలోని అన్నదాత పెస్టిసైడ్ షాప్‌లో తనిఖీలు నిర్వహించి రికార్డులు సరిగ్గా లేనందున అమ్మకం నిలుపుదల ఉత్తర్వులను అందించడం జరిగిందని ఏవో లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

మహిళా భద్రతే షీ టీం లక్ష్యం : ఏఎస్సై

ముప్కాల్, సెప్టెంబరు 26: మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళ భద్రతే షీ టీం లక్ష్యంగా ఉంటుందని ఏఎస్సై శంకర్ అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నాటికలు, పాటల ద్వారా విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించకూడదని, అలా చేస్తే వారికి కఠినమైన శిక్షలు ఉంటాయని, మహిళలకు అండగా షీటీం పని చేస్తుందని, అత్యవసర సమయంలో 87126 59795, 100డయల్ చేయాలని సూచించారు. ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలకు బానిసలు కావోద్దని, అంతేగాకుండా సెల్‌ఫోన్‌కు ఎంత దూరం ఉంటే అంత భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రెంజల్,సెప్టెంబరు 26: మండలంలోని సాటాపూర్ గ్రామంలో గురువారం మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు 8 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో పాటు ఒక ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉండేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా న్యాయం చేకూరుతుందని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనారోగ్యం పాలైన వ్యక్తులకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరు కృషి చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృత.జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, జావీదోద్దీన్, గంగాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో మహాజన సభ

బోధన్‌రూరల్,సెప్టెంబరు 26: బోధన్ పట్టణంలో గురువారం మహాజన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీకి సంబంధించిన లెక్కలను సొసైటీ సెక్రెటరీ ఉమాకాంత్ రైతులకు వివరించారు. బోధన్ సొసైటీ లాభాల్లో ఉందని రైతులకు వివరించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని సభలో తీర్మానించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. రైతు రుణమాఫీపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఏడీఏ

రెంజల్, సెప్టెంబరు 26: మండలంలో అకాల వర్షానికి నష్టపోయిన పంటలతో పాటు వరిపంటకు బ్యాక్టీరియా, ఎండు తెగులు, సుడిదోమ కలిగిన పంటలను వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డితో కలిసి ఏడీఏ అలీం అహ్మద్ పరిశీలించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు బ్యాక్టీరియా, ఎండు తెగులు, సుడిదోమ వంటి తెగుళ్ల ద్వారా పంట నష్టం వాటిల్లిందని వీటి నివారణకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి అజయ్, రెంజల్ పీఏసీఎస్ కార్యదర్శి ఇంద్రసేన్, రైతులు చంద్రశేఖర్, సాయిలు, నారాయణ, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలి

కోటగిరి,సెప్టెంబరు 26: ఖరీఫ్ కోతలు ప్రారంభం కావడంతో తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి సహకార సంఘం మహజన సభ శుక్రవారం విండో అధ్యక్షులు సునీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి సంఘానికి ఎక్లాస్‌పూర్‌లో గోడౌన్, కొత్తపల్లిలో రైస్‌మిల్ ప్రహరీ నిర్మించాల్సి ఉందని వివరించారు. సంఘం ఆధ్వర్యంలో పెస్టిసైడ్ షాపులు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. రుణమాఫీ, రైతు భరోసాపై ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు లక్ష్మారెడ్డి, తుకారాం, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన సిరికొండ బంజార నాయకులు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 26: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాదులో గురువారం సిరికొండ బంజార సంఘం నాయకులు కలిసి సన్మానించారు. అధిష్టానం నూతనంగా టీపీసీసీ బాధ్యతలు మహేశ్ గౌడ్‌కు అప్పజేప్పడంతో సిరికొండ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు విస్తృత ప్రచారం చేయాలని మహేశ్ గౌడ్ సూచించారని నాయకులు తెలిపారు.

బోధన్‌లో ప్రశాంతంగా రేషన్ డీలర్ల రాత పరీక్ష

బోధన్‌రూరల్, సెప్టెంబరు 26: బోధన్ డివిజన్ పరిధిలో గురువారం నిర్వహించిన రేషన్ డీలర్ల రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 180 మంది అభ్యర్థులను అర్హులుగా ఎంపిక చేసిన అధికారులు బోధన్ డిగ్రీ కళాశాలలో గురువారం రాత పరీక్ష నిర్వహించగా 179మంది హజరయ్యారని బోధన్ తహసీల్దార్ విఠల్ తెలిపారు. ఎడపల్లి, కోటగిరి, బోధన్, సాలూర మండలాల్లో ఖాళీగా ఉన్న 18రేషన్ డీలర్ల షాపులలో డీలర్ల భర్తీకి రాత పరీక్ష నిర్వహించారు. అభ్యర్థుల మార్కుల జాబితాను సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గోడపై ప్రదర్శించారు. మార్కుల జాబితా ప్రదర్శించడంతో రాత పరీక్ష రాసిన అభ్యర్థులతో సబ్ కలెక్టర్ కార్యాలయం కిక్కిరిసింది. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ మెరిట్ సాధించిన వారికి త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రమాదవవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

నందిపేట, సెప్టెంబరు26: మండల కేంద్రంలోని రాజనగర్ దుబ్బా ప్రాంతానికి చెందిన పత్రి కన్నయ్య(34) అనే వ్యక్తి ఊరచెరువులో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్టు ఎస్సై ఎ.హరిబాబు తెలిపారు. ఇటీవల గణేష్ నిమజ్జనంలో భాగంగా గణేష్ ప్రతిమలను నిమజ్జనం చేసిన ఊరచెరువులో వాటి ఇనుప చువ్వలను తీసుకునేందుకు చెరువులోకి దిగిన కన్నయ్య ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈనెల 25న ఇంటి నుంచి వెళ్ళిన కన్నయ్య బైపాస్ రోడ్డులోని ఊరచెరువులో శవమై కనిపించాడని పోలీసులు పేర్కొన్నారు. మృతుని భార్య పత్రి హుసేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎ.హరిబాబు తెలిపారు.

నడిపల్లిలో ఘనంగా ఊర పండుగ

డిచ్‌పల్లి, సెప్టెంబరు 26: మండలంలోని నడిపల్లి గ్రామంలో ఊర పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా తయారు చేసిన గ్రామ దేవతలను ఊరేగింపు నిర్వహించి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు.

రామగుండం థర్మల్ ప్లాంటును నెలకొల్పాలి

● జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన

మెండోర, సెప్టెంబర్ 26: రాష్ట్రంలో రామగుండం థర్మల్ ప్లాంటు మొత్తం నిర్మాణాన్ని రాష్ట్ర జెన్‌కో ఆధ్వర్యంలోనే నెలకొల్పాలని ఎట్టి పరిస్థితుల్లో సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించేది లేదని రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ యూనియన్ జేఏసీ నాయకులు రఫీక్, సతీష్, భరత్ స్పష్టం చేశారు. గురువారం మండలంలో పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ నాయకులు రఫిక్, సతీష్, భరత్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ అయిన రాష్ట్ర జెన్‌కో ద్వారానే రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సురేష్‌కుమార్, వేణుగోపాల్, నితిన్‌సింగ్, ప్రవీన్, తక్కన్న, మంజుల, మేఘన, స్వాతి, హేమలత, నవనీత, సింధుజ, నితిష్, నవనీత్, గంగాధర్, వినోద్‌కుమార్, శేఖర్, విద్యుత్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య ఆరోగ్య పరీక్షలు

మోర్తాడ్, సెప్టెంబరు 26: మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు సఫాయి మిత్ర సురక్ష శిబిరంలో భాగంగా గురువారం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మోర్తాడ్, గాండ్లపేట్, దొన్కల్, పాలెం, ధోన్‌పాల్, శెట్‌పల్లి గ్రామ పంచాయతీ వర్కర్‌లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 64 మంది బీపీ, షుగర్, అవసరమైన రక్త పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, వైద్యులు ప్రవీన్‌కుమార్, పూజ, రాజేందర్, ఫార్మసిస్ట్ సంజీవ్, గంగాధర్, పద్మ పాల్గొన్నారు.

చేపూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 26: ఆర్మూర్ మండలం చేపూర్‌లో గురువారం పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పాఠశాల విద్యార్థులకు పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిష్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మహేష్, కమిటీ సభ్యులు శృతిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు
రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలి

నవీపేట,సెప్టెంబరు 26: అర్హులైన రైతులకు 2 లక్షల రూపాయల వరకు పంట రుణమాఫీని అమలు చేయాలని నవీపేట సొసైటీ మహాజన సభలో తీర్మానించారు. గురువారం సొసైటీ ఆవరణలో 62వ మహాజన సభను నిర్వహించారు. నవీపేట సొసైటీలో 800 మంది సభ్యులకు గాను కేవలం 300 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించిందని మిగిలిన 500 మందికి రుణమాఫీ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అంతకుముందు పలువురు సభ్యులు మాట్లాడుతూ గతంలో సొసైటీలో ఉద్దరగా ఎరువులు పొంది బకాయిలు చెల్లించని వారి నుంచి వెంటనే సంబంధిత డబ్బులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్‌లు రాము, బాల గంగాధర్, గణేష్, శ్రీనివాస్, గోపి, కాంతం, కార్యదర్శి మహేష్ తదితరులున్నారు.

ఎడపల్లిలో సహకార సంఘం మహాజన సభ

ఎడపల్లి, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పోల మల్కారెడ్డి ఆధ్వర్యంలో మహాజన సభను నిర్వహించారు. ఈ సభ ప్రారంభంలో సహకార సంఘం లావాదేవీలను సంఘ సభ్యులకు సంఘం కార్యదర్శి రాజారాం సభలో చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ మల్కారెడ్డి మాట్లాడుతూ తాను అధికారం చేపట్టే నాటికి నష్టాల్లో ఉన్న సహకార సంఘం ప్రస్తుతం లాభాల్లో ఉందని అందుకు సహకరించిన ప్రతి సభ్యునికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సహకార సంఘం అభివృద్ధికి కావలసిన కొన్ని తీర్మానాలను సంఘ సభ్యులు ఆమోదించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్‌ను సహకార సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

జానకంపేటలో..

జానకంపేట సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ మిద్దె నరేందర్ అధ్యక్షతన నిర్వమించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ బ్యాంకు చైర్మన్ కుంట రమేష్ రెడ్డి, డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, శరత్‌లు హాజరయ్యారు. వీరిని సంఘ షభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం చైర్మన్ నరేందర్ సహకార సంఘానికి బీరువాను అందించారు. ఈ కార్యక్రమంలో ఇరు సహకార సంఘాల డైరెక్టర్‌లు బర్దిపూర్ ప్రవీణ్, అనీల్ రెడ్డి , సుమన్, నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

మండల విద్యాధికారిగా
సాయిలుకు అదనపు బాధ్యతలు

ఎడపల్లి, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తె/మీ ప్రధానోపాధ్యాయులు సాయిలు మండల విద్యాశాఖ అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పటిష్టం చేయడానికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, క్రమశిక్షణను పెంపొందించడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పోతంగల్ ఎంఈవోగా శంకర్

కోటగిరి,సెప్టెంబరు 26: పోతంగల్ మండల విద్యాశాఖ అధికారిగా కల్లూర్ జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శంకర్ బాధ్యతలు స్వీకరించారు. పోతంగల్ మండ ల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయంలో ఎంఈవో నాగనాథ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన ఎంఈవో నాగనాథ్‌ను పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నాగనాథ్, అమ్జద్ ఖాన్, ప్రభాకర్, తారోజాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన ఇద్దరు మహిళల అరెస్టు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 26: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గంగవ్వ అనే మహిళ బాన్సువాడ బస్సు ఎక్కుతుండగా దెగ్లూర్‌కు చెందిన ఇద్దరు మహిళలు ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాగేందుకు ప్రయత్నం చేయగా ఆమె అరవడంతో ప్రయాణికులు దొంగతనానికి యత్నించిన మహిళలను పోలీస్‌లకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ బాన్సువాడ మండలం బండపల్లి గ్రామానికి చెందిన గంగవ్వ బోధన్ నుండి సొంతూరు వెళ్లడానికి అంబేద్కర్ చౌరస్తా బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతుండగా చోరీ యత్నం ఘటన చోటు చేసుకుందన్నారు. స్థానిక మహిళల పట్టుకుని దొంగతనానికి యత్నించిన మహిళలను పోలీసులకు అప్పగించారన్నారు. ఈ సందర్భంగా గంగవ్వ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామన్నారు.

సెప్టెంబరు 30న చలో ఇందిరాపార్కు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 26: గ్రామ పంచాయతీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నా కార్మికులు విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గంగాధర్ పిలుపునిచ్చారు. గురువారం పంచాయతీ కార్మికులతో కలిసి డిచ్‌పల్లిలో చలో ఇందిరా పార్కు పోస్టర్ లను ఆయన ఆవిష్కరించారు. చాలీ చాలానీ వేతనాలతో ఉద్యగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యూలర్ చేస్తు జీతలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎస్ సౌకర్యాం కల్పించాలని డిమాండ్ చేశారు. 30న జరిగే ధర్నా కార్యక్రమానికి కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అనంతరం ఎంపీడీవో రవీందర్,ఎంపీవో శ్రీనివాస్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

మూర్ఛ వ్యాధితో వ్యక్తి మృతి

మాక్లూర్, సెప్టెంబరు 26: మాక్లూర్ మండలం కల్లెడి గ్రామానికి చెందిన రంగం మహేష్ (28) అనే వ్యక్తి మూర్ఛ వ్యాధితో మృతి చెందినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు బుధవారం సాయంత్రం చికెన్‌షాప్‌కు బయలుదేరి వెళ్లి ఎంతకు ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం పంట చెనులో శవమై కనిపించాడు. మృతునికి మూర్ఛ వ్యాధి ఉందని, మూర్ఛ వ్యాధితో మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు వెల్లడించారు. మృతుని భార్య శరణ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



చాకలి ఐలమ్మ జయంతిలో పాల్గొన్న రజక సంఘం సభ్యులు



ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేల్పూర్, సెప్టెంబరు 26: నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి అని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ శివగౌరి రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, బబ్బురు ప్రతాప్‌రెడ్డి, వేల్పూర్ శివగౌరి రజక సంఘం సభ్యులు దేవేందర్, లక్ష్మణ్, జైపాల్, శ్రీనివాస్, చంటి, నరేష్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని పులే విగ్రహం వద్ద గురువారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మండల దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మల్లూరి రాజారాం ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అహర్నిశలు పోరాడిన తెలంగాణ వీర వనిత, తెలంగాణ సా యుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనపై నిప్పులు కురిపించిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంబవా మామిడి మల్లయ్య పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో..

కమ్మర్‌పల్లి: తెలంగాణ వీరనారి వనిత చాకలి ఐలమ్మ జయంతిని మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఆమె చిత్రపటానికి గ్రామ రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నవీపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం మండలంలోని నాళేశ్వర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, నర్సింగ రావు, ప్రవీణ్, శ్రీనివాస్, రాజు, రజక సంఘం అధ్యక్షులు దేవన్న, భోజేందర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండల రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం జరుపుకున్నారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు జనగరి జయరాం, రజక సంఘం సభ్యులు వీరపురం సాయిలు, నరేందర్, గంగాధర్, శంకర్, భీమయ్య పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండల రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం ప్రధాన కార్యదర్శి మల్లెపూల శ్రీనివాస్ రజక సంఘం సభ్యులు మల్లెపూల సాయిలు, నాగయ్య, సాయిలు, బాబయ్య, నారాయణ, గంగా శేఖర్, రాజు, హన్మాండ్లు, శంకర్, నరేందర్, భాస్కర్ ఉన్నారు.

డొంకేశ్వర్: చాకలి ఐలమ్మ జయంతిని డొంకేశ్వర్ మండల కేంద్రంలో రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డొంకేశ్వర్ కార్య దర్శి శేఖర్ గౌడ్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం 129వ చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దోబిఘాట్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, పట్టణ ప్రధానకార్యదర్శి పులి యుగంధర్, ఓబీసీ మోర్చ పట్టణ అధ్యక్షుడు బాశెట్టి రాజ్‌కుమార్, ఉదయ్‌గౌడ్, దక్షిణమూర్తి, బట్టు రాము, కోల మధు, చుక్కల అనిల్ పాల్గొన్నారు.

రెంజల్: తెలంగాణ వీర వనిత, పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని రజక సంఘం నాయకులు అన్నారు. గురువారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో మండల్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరెడ్డి, మొగులనా, నర్సయ్య, ఖుద్దుస్, గాండ్ల ప్రసాద్, సుధాకర్ రావు, సాయిలు, సురేష్ పటేల్, రజక సంఘం నాయకులు శ్రీనివాస్, సాయిలు, సుమన్, మోహన్, ఎల్లయ్య, ప్రశాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం అని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము అన్నారు. గురువారం సాలూర మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, నాయకులు నరేందర్ రెడ్డి, అల్లె రమేష్, డిస్కో సాయిలు, పాండు, వెంకట్ పటేల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

● **బోధన్ పట్టణంలో**

బోధన్ పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 26: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, ఆరోగ్యకమైన జీవితానికి దోహదపడతాయని, ప్రతీ యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని సమయాన్ని క్రీడల కోసం కేటాయించి మంచి క్రీడాకారుడిగా నిలవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండకేంద్రంలోని మినీ స్టేడియం క్రీడా ప్రాగణంలో నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల ప్రారంభంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని ఒడిన వారు గెలుపు కోసం కష్టపడాలన్నారు. క్రీడల నిర్వహణ అంత సులువు కాదని మల్లేష్ లాంటి క్రీడా ప్రేమికులు ఉండడం వల్లే క్రీడలు జీవంగా ఉంటున్నాయన్నారు. క్రీడల నిర్వహణకు కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. మా వియ్యంకుడు వ్యాపారవేత్త దయానంద్‌రెడ్డి దాతృత్వానికి అవధులు లేవని నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు పాఠశాలల్లో డిస్క్ బేంచీలు, క్రీడా దుస్తులు కంప్యూటర్లు, వ్యాయామ పరికరాలు అందించిన ఘనత ఆయనదేనన్నారు. రానున్న రోజుల్లో అమీర్‌నగర్ లాంటి గ్రామీణ పాఠశాల విద్యార్థులకు సైతం స్పోర్ట్స్ డ్రెస్‌లు, క్రీడాపరికరాలు అందించే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. తన ప్రభుత్వ హయంలోనే కమ్మర్‌పల్లి మినీ స్టేడియం ఏర్పడిందని ఇదే మైదానంలో తొలి సారిగా మండల స్థాయి క్రీడలు నిర్వహించడం తనకానందంగా ఉందన్నారు. లక్షలాది వ్యయంతో నిర్మించిన స్టేడియాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రా మస్తులు, యువతదేనన్నారు. క్రీడల నిర్వహణ, బోధన తదితర వసతులు కల్పించిన దాతలను అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కార్యదర్శి ఎం. నాగమణి, మండల క్రీడల కన్వీనర్ సాయన్న, ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ ఎం.అంజనేయులు, ఎంఈవో ఎన్ ఆంధ్రయ్య, సింగిల్‌విండో చైర్మన్‌లు రేగుంట దేవేందర్, కుంట ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గడ్డం స్వామి, బాలెరావు రాజేశ్వర్, దేవయ్య, పీఈటీలు పవన్, కె.గంగాధర్, వి.గంగాధర్, నాగభూషణం క్రీడాభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

దసరాకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ

● అర్ధాంతరంగా ఆగిన బస్టాండ్ నిర్మాణానికి 2.5 కోట్లు విడుదల
● ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 26 : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని మూడు మండలా ల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిలో 50, నాగిరెడ్డిపేట 16, లింగంపేట్ 22, కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేసినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపా రు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌మోహన్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు అందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని అన్నారు. రైతు రుణమాఫీతో రాష్ట్రంలోని రైతులకు ఎంతో మేలు కలిగిందని అన్నారు. త్వరలో రైతులకు రైతు భరోసా కూడా వచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రజలందరూ వ్యవ సాయం మీద ఆధారపడి బతుకుతున్న బతుకులు అని అన్నారు. అర్ధాంతరంగా ఆగిన ఎల్లారెడ్డి బస్టాండ్‌కు నిధులు లేక ఆగిపోయిన పనులను త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. గరీబోళ్లకు ఇండ్లు లేవని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులు ఆగడంతో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి దశకు చేరుకుందన్నారు. దసరా పండుగ రోజు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. ఎల్లారెడ్డి బస్టాండ్ నిర్మాణం పనులకు 2.5 కోట్ల రూపాయలు నిధులు కేటాయించి పనులు ప్రారంభం వేగవంతంగా కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ సామేల్, గయా జుద్దీన్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలు

ముప్కాల్, సెప్టెంబరు 26: ముప్కాల్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సాగర్, డీసీసీడెలిగేట్ ఉపాధ్యక్షుడు సుంకరి రాజ్‌కుమార్, చిన్న గంగారెడ్డి, కోల ప్రవీణ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద జైడిరవి, కోల సుభాష్ ప్రశాంత్, ముస్కు శీను, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలను కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్ పడిగెల ప్రవీణ్, జిల్లా మైనారిటీ నాయకుడు అబ్దుల్ రఫీ, పాలెపు నర్సయ్య, బుచ్చి మల్లయ్య, కొముమలమురళి, శ్రీనివాస్, శేఖర్, నల్ల గణేష్, అజాహరోద్దీన్, ప్రదీప్, ప్రసాద్, అజ్మత్ హుసేన్, గణేష్ గౌడ్, శ్రీరాముల మురళి, మోహన్, అశన్న పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రోగులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ జన్మదినం పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గిర్మాజీగోపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత ఆసుపత్రిలో రోగులకు, సిబ్బంది పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని పదిమంది కాంగ్రెస్ నాయకు లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గిర్మాజీ గోపి, మాజీ ఎంపీపీ జె.గంగాధర్, నందంగౌడ్, నరేష్, గురువయ్య, మహిపాల్, రవి పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

బాధితుడికి
రూ.2లక్షల 50వేల అందజేత

ముప్కాల్, సెప్టెంబరు 26: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన పి.నర్సయ్య తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి చేరగా, ఆపరేషన్ చేయించు కోవాలని వైద్యులు సూచించారు. ఈ విషయమై ఆపరేషన్ కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌ను సంప్రదించగా సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌వోసీ అందజేసిన సునీల్ కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 26: పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ సలీం మాట్లాడుతూ విద్యార్థులకు విద్య హక్కు చట్టం బాల కార్మికుల హ క్కు చట్టం ఇతర చట్టాల గురించి అవగాహన కల్పించారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 26: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

అంకాపూర్ గ్రామాన్ని
సందర్శించిన రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం కోనరావుపేట మండలాల్లోని నాగులపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ పరస్పర సహకార సంఘ రైతులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో కొనారావుపేట రైతులు దేవరావు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రైజ్‌మనీ అందజేత

ఆర్మూర్ రూరల్, సెప్టెంబరు 26: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం ప్రైజ్ మనీ అందజేశారు. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం పదో తరగతిలో మొదటి రెండు స్థానాల్లో గెలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదు బహుమతిని మహేందర్‌రెడ్డి అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పర్వీన్, పెర్కిట్ వీడీసీ అధ్యక్షుడు దేవేందర్, సత్యం, నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో
మగ్గిడి విద్యార్థులకు ప్రథమ బహుమతి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 26: ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన డి.శ్రీనివాస్ మెమోరియల్ టోర్నమెంట్‌లో మగ్గిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానం సాధించినట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. వాలీబాల్ విభాగంలో మగ్గిడి పాఠశాల బాలుర, బాలికల జట్లు ప్రథమ స్థానం పొంది ఒక్కొక్క జట్టుకు రూ.10వేల నగదు పురస్కారాన్ని అందుకున్నారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులు సాధించిన బాలబాలికల జట్లను గురువారం పాఠశాలలో హెచ్‌ఎం హరిత, వీడీసీ సభ్యులు అభినందించారు.

మండల క్రీడల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 26: ఆర్మూర్ పట్టణ శివారులోని గాంధీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు ఇటీవల జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన మండలస్థాయి క్రీడా పోటీల్లో ఐదు విభాగాల్లో బహుమతులు సాధించినట్టు కరస్పాండెంట్ మానస గణేష్ తెలిపారు. ఖోఖో సబ్ జూనియర్ బాలుర విభాగంలో ప్రథమ, కబడ్డి సబ్ జూనియర్ బాలుర విభాగంలో ప్రథమ, మార్చ్‌ఫస్ట్‌లో ప్రథమ, ఖోఖో సబ్ జూనియర్‌లో కబడ్డీ సబ్ జూనియర్‌లు బాలికల జట్టు ద్వితీయ బహుమతులు సాధించినట్టు వారు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను కరస్పాండెంట్ మానస గణేష్, పరిపాలన అధికారిణి పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

గర్భిణులు, బాలింతలు,
పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

నవీపేట,సెప్టెంబరు 26: గర్భిణులు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత కోరారు. గురువారం మండలంలోని నాగేపూర్ రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చడం జరిగిందని దీని ద్వారా చిన్నారులకు నూతన విద్యను అందించాలని సూచించారు. అంతకుముందు చిన్నారులు నిర్వహించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం, పలువురు చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రాధాలక్ష్మి, భాగ్యలక్ష్మి, నాగేపూర్ మాజీ సర్పంచ్ స్వరూప, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులున్నారు.

పోలియో నిర్మూలనకు రోటరీ క్లబ్ కృషి

పెర్కిట్, సెప్టెంబరు 26: ఆర్మూర్ పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్‌ను రోటరీ గవర్నర్ శరత్ చౌదరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పోలి యో నిర్మూలనకు రోటరీ ఎంతగానో కృషి చేసి ఎక్కడ కూడా పోలియో కేసులు లేకుండా చేసిన ఘనత రోటరీదేనని, ప్రజల సహాయార్థం రోటరీ ద్వారా కిడ్నీ ఫెయిల్ అయిన వారి కోసం డయాలసిస్ సెంటర్‌ను, చిన్న పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్‌లు, క్యాన్సర్ వ్యాధి చివరి దశ చేరి ఇక నయం అనుకున్న తరుణంలో హైదరాబాద్ స్పార్శ ఆసుపత్రి ద్వారా 10వేల500రోగులకు ఉచిత సేవలు అందించడం విశేషమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్ మాట్లాడుతూ చిన్న చిన్న సేవ కార్యక్రమాలతో పాటు రాబోయే రోజుల్లో మెగా ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు.



మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి

కమిషనరేట్ పరిధిలో ఐదుగురు సీఐల బదిలీలు

ఖిల్లా, సెప్టెంబరు 26: పోలీసు కమిషనరేట్ మల్టీజోన్ పరిధిలో ఐదు గురు సీఐలను బదిలీలు చేస్తూ సీపీ కల్మేశ్వర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. నిజామాబాద్ ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డి.విజయ్‌బాబును బోధన్ రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా, అక్కడ విధులు నిర్వహిస్తున్న కోల నరేష్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ నగర ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరహరిని మల్టీజోన్-1 ఐజీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని, సీసీఆర్‌బీ నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాస్‌రాజ్‌ను నిజామాబాద్ నగర ఇన్స్‌పెక్టర్‌గా, ఐజీ కార్యాలయం హైదరాబాద్‌లో వెయిటింగ్‌లో ఉన్న బి.రఘుపతిని ఎస్‌హెచ్‌వో నిజామాబాద్ ఒకటో టౌన్‌కు బదిలీ చేశారు.

హోరాహోరీగా డీఎస్ స్మారక పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 26: డీఎస్ స్మారక పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. ఖోఖో, కబడ్డీ క్రీడల్లో అండర్-14, అండర్-17 బాల బాలికల పోటీలు ఉత్కంఠగా సాగాయి. బాలికల విభాగంలో కేజీబీవీ బాల్కొండ విజేతగా నిలవగా, జడ్పీహెచ్‌ఎస్ రాంపూర్ రన్నరప్‌గా నిలిచాయి. ఈ క్రీడలకు నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ చైర్మన్ డి.సంజయ్ హాజరై విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, డి.సాయిలు, వెంకట్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ధర్పల్లి, సెప్టెంబరు 26: సంవత్సరాలు గడుస్తున్నా వీఆర్‌ఏ వారసులకు ఎలాంటి గుర్తింపు లేదని వెంటనే ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వీఆర్‌ఏ వారసులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోగల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు. తమకు అవకాశం కల్పించకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని అన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, జలేందర్, రాజు, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగిని కుటుంబ సభ్యులకు అప్పగింత

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో 9 సంవత్సరాలుగా ఉన్న మానసిక రోగిని గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. అనిత తెలిపారు. రోగికి సంబంధించిన వివరాలను సూపరింటెండెంట్ వివరించారు. నిజామాబాద్‌కు చెందిన 50 సంవత్సరాల మానసిక రోగి 2015లో మానసిక వ్యాధితో ఆస్పత్రిలో చేరారని తెలిపారు. ఆస్పత్రి నిబంధనల ప్రకారం రోగి ఆరోగ్యం కుదుటపడగానే ఒకటి, రెండు సంవత్సరాల లోపల కుటుంబ సభ్యులకు అప్పగిస్తాము, కానీ నిజామాబాద్‌కు చెందిన ఈ రోగి ఆరోగ్యం కుదుటపడినా వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసుకుపోయేందుకు సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని ఆమె తెలిపారు. ఆస్పత్రి లీగల్ సెల్ అడ్వైజర్ మంజుల గౌర్‌ను సంప్రదించి విషయం తెలపగా ఆమె వారి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో రోగి భర్త, తండ్రి గురువారం వచ్చి ఆమెను ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లారని సూపరింటెండెంట్ అనిత వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పూజిత, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంఈవోలకు సన్మానం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: నూతన మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన నిజామాబాద్ అర్బన్ నార్త్, సౌత్ ఎంఈవోలు వెంకట్‌నారాయణ, సాయరెడ్డిలకు గురువారం పీఆర్‌టీయూ నార్త్, సౌత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇతర కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. మోపాల్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన గేమ్‌సింగ్‌ను సైతం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో నార్త్ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, జావిద్ పాల్గొన్నారు.

మహాజన సభలో రభస

సిరికొండ, సెప్టెంబరు 26:తూంపల్లి సహకార సంఘం మహాజన సభలో రైతులు రభస సృష్టించారు. సొసైటీ చైర్మన్ రాములు అధ్యక్షతన గురువారం జరిగిన మహాజన సభలో రుణాలు మాఫీ కాని 24 మంది రైతులు రభస సృష్టించారు. సహకార సంఘంలో పనిచేసే సిబ్బంది తప్పిదం వల్ల తమ పేర్లను ఆన్‌లైన్‌లో ఆలస్యంగా నమోదు చేయడం వల్లనే రుణాలు మాఫీ కాలేదని సిబ్బందిని నిలదీశారు. దానికి అధ్యక్షుడు రాములు నాయక్ మాట్లాడుతూ రుణాలు మాఫీ చేయడం కోసం మేము సహకార శాఖ అధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని మళ్లీ ఒకసారి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

మాధవనగర్ రైల్వే పట్టాలపై యువకుడి వీరంగం

● రైల్వే ట్రాక్‌పై రాళ్లు పెట్టి.. అడ్డుగా కూర్చొని హంగామా


హంగామా చేస్తున్న యువకుడు, పట్టాలపై యువకుడు పెట్టిన రాళ్లు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 26 : నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్ రైల్వే గేటు వద్ద గురువారం ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. మధ్యాహ్నం వేళ రైలు వచ్చే సమయంలో రైల్వే గేటు వద్ద నానా హంగామా చేశాడు. రైల్వే పట్టాలపై రాళ్లు పెట్టి.. ఏకంగా ట్రాక్‌పైనే అడ్డుగా కూర్చున్నాడు. ఇదే సమయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మల్టీ ఇంజన్ రావడంతో.. అక్కడ ఉన్నవారందరిలో టెన్షన్ నెలకొంది. అయితే లోకో పైలెట్ సదరు యువకుడిని గుర్తించి మాధవనగర్ గేటు మ్యాన్‌కు సమాచారం అందించాడు. దీంతో గేటు మ్యాన్ రాజు ఆ యువకుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. అతనిపైనా రాళ్లు విసిరాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో.. సదరు యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా.. యువకుడి నిర్వాకంతో రైల్వే గేటు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

'రైతులకు రావాల్సిన డబ్బులు ఇప్పించండి'


మోపాల్‌లో పీఏసీఎస్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మోపాల్, సెప్టెంబరు 26 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేసి సీరియస్ ప్రకారంగా ధాన్యాన్ని తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు సొసైటీ పాలకవర్గం సభ్యులకు సూచించారు. బుధవారం మోపాల్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ సొసైటీ డైరెక్టర్ల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. సీరియల్ ప్రకారం వరి ధాన్యాన్ని తీసుకోవాలని ఇష్టం వచ్చినట్లుగా తీసుకుంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది రైతులు సొంత లారీలను పెట్టుకొని రైస్‌మిల్లులకు ధాన్యం తరలించిన డబ్బులు ఇంకా తమకు రాలేదని సొసైటీ పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు. కడత పేరుతో ఎక్కువ ధాన్యాన్ని తీసుకుంటున్నారని అన్నారు. ఇకనుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గంగారెడ్డి మాట్లాడుతూ రైతుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని మునుముందు అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఆయా గ్రామాల డైరెక్టర్లతో పాటు రైతులు పాల్గొన్నారు.

'రైతుల సహకారంతో సొసైటీ అభివృద్ధి'

మోపాల్, సెప్టెంబరు 26 : రైతుల సహకారంతో పాల్దా సొసైటీ సహకార సంఘం అభివృద్ధి బాటలో నడుస్తుందని సొసైటీ అధ్యక్షుడు కౌలాస్ శ్రీనివాస్ అన్నారు. గురువారం నిజామాబాద్ రూరల్ మండలంలోని పాల్దా ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన రుణమాఫీలో భాగంగా సొసైటీలో 183 మంది రైతులకు గాను 17లక్షల 27వేల 424 రూపాయలు మాఫీ అయినట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన యూరియాను అందుబాటులో ఉంచామని తెలిపారు. రుణమాఫీ అయిన రైతులకు కూడా కొత్త రుణాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ప్రజలను మోసం చేయవద్దు : ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 26: విదేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాజ్యాంగాన్ని అవమాన పర్చిన రాహుల్‌గాంధీ దేశభక్తులకు క్షమాపణ చెప్పాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చ అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దేశ ప్రతిష్ఠకు అవమానం కలిగేలా మాట్లాడారని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా రిజర్వేషన్‌ల గురించి మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు రాజ్యాంగం పట్ల, ఎస్సీల పట్ల ప్రేమ లేదన్నారు. రాహుల్ గాంధీ దేశభక్తులకు క్షమాపణ చెప్పే వరకు వదిలే ప్రసక్తి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్‌కుమార్, సంజీవ్, పవర్ సాయినాథ్, బాలకృష్ణ, కెప్టెన్ రాజు, కిరణ్, ఎస్సీ మోర్చ నాయకులు పాల్గొన్నారు. ఎస్సీ మోర్చ అధ్యక్షుడు శివప్రసాద్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ బిజెపికి చెందిన ఎస్సీ కార్పొరేటర్లు విలేకరుల సమావేశాన్ని బహిష్కరించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలిచిన విలేకరుల సమావేశానికి హాజరు కాలేదు. ఎస్సీ మోర్చ అధ్యక్షుడు శివప్రసాద్ సమాచారం ఇవ్వకుండానే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాడని తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

సుభాష్‌నగర్, సెప్టెంబరు 26: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు జిల్లాకు చెందిన గణేష్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడు గణేష్‌ను నిజామాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగమోహన్ చక్రు ఘనంగా సన్మానించారు. జాతీయస్థాయి పోటీలు హైదరాబాద్‌లో జరుగనున్నాయని ఈ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున గణేష్ పాల్గొంటాడని తెలిపారు. కార్యక్రమం లో అసోసియేషన్ సభ్యులు గట్టాడి రాజేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యా య సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ సమావేశంలో తాహెర్‌బిన్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: కర్నాటక ఉర్దూ అకాడమి చైర్మన్ మహ్మద్ అలీ ఖజి ఆహ్వానం మేరకు రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ గత రెండు రోజులుగా బెంగుళూరు పర్యటిస్తున్నారు. అక్కడ నిర్వహించిన గజల్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కర్నాటక ఉర్దూ అకాడమిలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల్లో ఉర్దూ అభివృద్ధితో పాటు భవిష్యత్తు దక్షిణ భారతదేశ ఉర్దూ ఫెడరేషన్ ఏర్పాటు కొరకు చర్చించారు. రెండు మూడు నెలల్లో ఫెడరేషన్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గజల్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అవార్డులు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ లియాకత్ హుస్సేన్, సూపరింటెండెంట్ కృష్ణ, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటక మైనార్టీ కమీషన్ చైర్మన్ నిసార్ హైమద్ సైతం పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ మేళా ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 28వ జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ మేళా గురువారం ప్రారంభమైంది. ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీపై నిర్వహించిన సైన్స్ మేళాను జిల్లా కేంద్రంలోని మానిక్‌భవన్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొనారు. ఈ మేళాలో మొదటి, రెండవ బహుమతులు పొందిన వారికి ఈనెల 27న జిల్లాస్థాయి యువజనోత్సవాలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడా అధికారి ముత్తెన్న తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 26: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు ఎంపికలను నిర్వహించారు. జూనియర్ విభాగంలో ఈ ఎంపికలను నిర్వహించారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఈ ఎంపికలను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగాయి. ఈ ఎంపికలో అత్యంత ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు అక్టోబర్ 4, 5, 6 తేదీలలో కామారెడ్డి జిల్లాలో జరుగనున్నట్లు బాల్‌బాడ్మింటన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి భూపతిరాజేశ్వర్, సంఘసభ్యులు మహేష్, సురేష్, జ్యోత్స్న, భాగ్యలక్ష్మి, గీత, కార్తిక్ పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

● మొబైల్ ట్రాకర్‌ద్వారా కాపాడిన పోలీసులు

ఖిల్లా, సెప్టెంబరు 26: భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గృహిణిని పోలీసులు కాపాడిన ఘటన రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన తోమాటి ప్రియాంకకు ఐదేళ్ల క్రితం బాన్సువాడకు చెందిన సంతోష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ప్రియాంకను భర్త గత కొన్ని రోజులుగా వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ప్రియాంక గురువారం తండ్రికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలపడంతో స్పందించిన కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆమె మొబైల్ ట్రాకర్ ద్వారా ఆమెను గుర్తించి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. సకాలంలో చేరడంతో గృహిణిని ఆత్మహత్యాయత్నం నుంచి కాపాడి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు


నివాళి అర్పిస్తున్న పోలీసు సిబ్బంది

సుభాష్‌నగర్, సెప్టెంబరు 26:తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో దొరలు, భూస్వాములు, పెత్తందారులపై పోరాటం చేసిన వీరవనిత ఐలమ్మ అని అన్నారు. తెలంగాణలో భూ పోరాటానికి నాంది పలికేలా చేసింది ఐలమ్మ స్ఫూర్తే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ అని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యెండల ప్రసాద్, తెలంగాణ శంకర్, మీసాల శంకర్, ఖురీ షి, శ్రీనివాస్‌గౌడ్, సురేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి గందమాల నాగభూషణం వినాయక్‌నగర్‌లో గల ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఖిల్లా : పోలీసు శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ బి.కోటేశ్వర్‌రావ్ ఐల మ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు.

మోపాల్ : చాకలి ఐలమ్మ జయంతిని మండలంలోని మంచిప్ప, బోర్గాం(పీ) గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే ముందుకు నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిరికొండ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు , భూమికోసం భుక్తి కోసం దొరలను, పెత్తందారులను వ్యతిరేకించిన వీర వనిత చిట్యాల ఐలమ్మ అని జిల్లా రజక సంఘం యువజన నాయకుడు బండి నరేశ్ అన్నారు. చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో చిన్నవాల్గోల్‌లో ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. సత్యశోధక్ పాఠశాలలోనిర్వహించిన ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి ఆమె సేవలను కొనియాడారు.

ఇందల్వాయి : మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందల్వాయి గ్రామంలో రజక సంఘం మండల అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా రజక సంఘ సభ్యులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో తనవంతు పాత్ర పోషించిందని ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎందరో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. ఆమె జయంతిని నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు శ్రీపతి దత్తు, ఆశన్న, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే పట్టభద్రులకు న్యాయం చేస్తా

● ఆల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 26: గత ముప్పై ఐదు సంవత్సరాలకు పైగా విద్యావ్యవస్థలో ఉన్న అపార అనుభవంతో పట్టభద్రులకు న్యాయం చేయగలనని తనకు వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభమైందని దీనిని ప్రతి ఒక్క పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో లక్షలాది మంది పట్టభద్రులు ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో కేవలం లక్షా 97వేల మంది మాత్రమే ఎన్‌రోల్ చేసుకున్నారని లక్షా 7వేల మంది మాత్రమే ఓటు వేశారని అన్నారు. పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగితే పట్టభద్రుల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేసి గెలిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని ప్రతి ఏడాది జాబ్‌క్యాలెండ్ విడుదల చేయిస్తానన్నారు. నిరుద్యోగులకు మంచి చేసేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని తెలిపారు.

కొలువుదీరిన దాడ్వాయి యూనియన్


ఎన్నికైన దాడ్వాయి యూనియన్ సభ్యులు

ఖిల్లా, సెప్టెంబరు 26: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ గంజ్‌లోని దాడ్వాయి యూనియన్ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో దాడ్వాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దాడ్వాయి అధ్యక్షులుగా నేరేళ్ల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రణం రవీందర్‌గౌడ్, కోశాధికారిగా ఎస్.ఉమేష్, ఉపాధ్యక్షుడిగా డి.ప్రవీణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

తూంపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు

సిరికొండ సెప్టెంబరు 26: మండలంలోని తూంపల్లి, పాకాల, గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును బీజేపీ సీనియర్ నాయకుడు గల్ఫ్‌కార్మిక నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరెస్ట్ ఆధిరోహించిన మాలవత్ పూర్ణ తండ్రి దేవిదాస్ బీజేపీ సభ్యత్వ నమోదు పొందారు. పాకాల గ్రామంలో బూత్‌కమిటీ అధ్యక్షుడు బదావత్ గంగాధర్ ఆధ్వర్యంలో 300 మంది సభ్యత్వం తీసుకున్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా నాయకులు ప్రచారం నిర్వహించాలని నర్సింహ నాయుడు అన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, బాలరాజు, మోహన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళలో విద్యార్థినికి వాట్సాప్‌లో మెసేజ్‌లు

● ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకం
● పాఠశాలకు వచ్చి.. చితకబాదిన యువకులు

మోపాల్, సెప్టెంబరు 26 : రాత్రివేళలో విద్యార్థినికి వాట్సాప్‌లో మెసేజ్‌లు చేస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని యువకులు చితకబాదిన ఘటన జిల్లాలో గురువారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..

నిజామాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన నాగ లింగవర్ధన్.. మండలంలోని ఓ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత బుధవారం రాత్రి 10గంటల వేళలో అతను పాఠశాలలో పదో తరగతి చదివే 15ఏళ్ల బాలిక సెల్‌ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ చేశాడు. గతంలోనూ పలుమార్లు బాలిక సెల్‌ఫోన్‌కు రాత్రి వేళలో ఇలాగే మెసేజ్‌లు చేశాడు. అయితే బుధవారం రాత్రి విద్యార్థినికి చేసిన మెసేజ్‌లను ఆమె తల్లిదండ్రులు చూశారు. దీంతో గురువారం బాలిక తల్లిదండ్రులతో పాటు గ్రామ యువకులు కలిసి ఉపాధ్యాయుడు నాగ లింగవర్ధన్ తీరుపై ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేసేందుకు పాఠశాలకు వచ్చారు. ఈ సమయంలో నాగ లింగవర్ధన్ కూడా స్కూల్‌లోనే ఉండడంతో.. ఆగ్రహానికి గురైన పలువురు యువకులు అతన్ని చితకబాదారు. బాలిక ఫోన్‌కు రాత్రి వేళల్లో ఎందుకు మెసేజ్ చేస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొట్టారు. దీంతో బాలిక తల్లిదండ్రులతో పాఠశాల తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది మాట్లాడారు. మున్ముందు ఇలాంటి ఘటనలు జరగవని సర్ది చెప్పడంతో.. యువకులు శాంతించారు. కాగా.. విద్యార్థినికి తాను ఎలాంటి అసభ్యకర మెసేజ్‌లు చేయలేదని ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగ లింగవర్ధన్ స్పష్టం చేశారు. మరోవైపు.. ఈ ఘటనపై తమకు ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఏఎస్సై రమేష్ తెలిపారు.